



క్యాంపస్ పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్ చీరల కార్తీక్

"బర్రెలు మేపేందుకు వెళ్లి.. 'ఉపాధి' గుంతలో పడి.."

ఇంటర్ విద్యార్థిని మృతి



శ్రీవల్లి (ఫైల్‌ఫోటో)



నివాళి అర్పిస్తున్న ఎంఎల్ఎ ఆదిమూలం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

ఉపాధి హామీ గుంతలో ప్రమాదవశాత్తు పడి ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... వరదయ్య పాలెం మండలం కువ్వాకుల్లి పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, కామేశ్వరి కూతురు శ్రీవల్లి (16) గూడూరు పట్టణం దొడ్ల రమాదేవి మహిళా కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్సులో (343)మార్కులు సాధించింది. సెలవులు కావడంతో బర్రెలను పంట పొలాల్లో తోలడానికి వెళ్లిన శ్రీవల్లి ప్రమాదవశాత్తు ఉపాధి హామీ గుంతలోకి బర్రెను తోలబోయి పడిపోయింది. ఈత రాకపోవడం, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందింది. కూలి పనులకు వెళ్లిన తల్లిదండ్రులు కూతురు ఇంటికి రాకపోవడంతో గురువారం అంతా వెతికి నిరుత్సాహపడ్డారు. శుక్రవారం శ్రీవల్లి మృతదేహం గుంతలో కనిపించడంతో అందరూ వెళ్లి అమ్మాయిని బయటకు తీసి చూడగా మృతిచెందినట్లు ధృవీకరించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు వేడుకొంటున్నారు. శ్రీవల్లి మృతి వార్త తెలుసుకున్న ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం ఆ కుటుంబాన్ని పరామర్శించి, ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దశరథన్, పవన్ పాల్గొన్నారు.

"స్మగ్లర్, నలుగురు విక్రేతలు అరెస్టు
12 కిలోల గంజాయి, ఫోన్లు స్వాధీనం"

గంజాయి కలకలం

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలోని సీతమ్మనగర్‌లో విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఉంచగా ఓ స్మగ్లర్‌ను, నలుగురు విక్రేతలను అరెస్టు చేశారు. వారి నుంచి 12 కిలోల గంజాయి, ఆరు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరైన వనం జీవన్‌కుమార్ గతంలో హత్యాయత్నం కేసులో ముద్దాయిగా ఉన్నాడు. చీరల కార్తీక్, రాజోళ్ల హరినాథ్‌లు ఎన్‌డిపిఎస్ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారు. ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఎస్వీయూ సిఐ రామయ్య చెప్పిన వివరాలిలా ఉన్నాయి.

ఎఎస్‌పి రవి మనోహర్ ఆచారికి వచ్చిన ముందస్తు సమాచారంతో తిరుపతి టౌన్ డిఎస్‌పి భక్తవత్సలం పర్యవేక్షణలో ఎస్వీయూ సిఐ రామయ్య, ఎస్ఐ కృష్ణయ్యలు గోప్యమైన సమాచారం ఆధారంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు సీతమ్మనగర్‌లో 80 అడుగుల రోడ్డులో తనిఖీ నిర్వహించారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రేకుల షెడ్డు పక్కన ఖాళీ స్థలంలో ముద్దాయిలను అరెస్టుచేసి, వారి వద్దనుండి 12 కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చీరల కార్తీక్ (27) పులికల్లు గ్రామం పెద్దతిప్పసముద్రం మండలం అన్నమయ్య జిల్లా వాసి. ఇతను గతంలో ఒక గంజాయి కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఎద్దుల హరి (20) పెద్దపల్లి గ్రామం మొలకలచెరువు మండలం అన్నమయ్య జిల్లా. రాజోళ్ల హరినాథ్ అలియాస్ హరీష్ (29) మట్లివారిపల్లి గ్రామం కురబలకోట మండలం అన్నమయ్య జిల్లా. ఇతనూ గంజాయి కేసులో ముద్దాయిగా ఉన్నాడు. వనం జీవన్‌కుమార్ (27) ఎస్‌బిఐ కాలనీ పులివెందుల టౌన్, కడప జిల్లా. ఇతను ఒక హత్యాయత్నం కేసులో ముద్దాయిగా ఉన్నాడు. చిన్నరెడ్డి వారి దిలీప్‌రెడ్డి (22), వరికశువుపల్లి గ్రామం పెద్దతిప్పసముద్రం మండలం అన్నమయ్య జిల్లా. చీరల కార్తీక్ కాకినాడ జిల్లా తుని ప్రాంతానికి వెళ్లి గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి తిరుపతిలోని తన స్నేహితులైన ఎద్దుల హరి, రాజోళ్ల హరినాథ్, జీవన్‌కుమార్, దిలీప్‌రెడ్డిలకు ఎక్కువ మొత్తానికి అమ్మి సొమ్ము చేసుకునేవాడు. గంజాయి అమ్మకందారులు చిన్న చిన్న పొట్లాలుగా మార్చి తిరుపతి పరిసర ప్రాంతాల్లో విక్రయాలు చేస్తూ అధిక లాభాలు పొందేవారని తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ యూనివర్సిటీ ఎస్ఐ భువనేశ్వరి, ఐడి పార్టీ ఏఎస్ఐ దామోదర్ పాల్గొన్నారు.

కళ్యాణ కట్టలో టీటీడీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారికి భక్తులు తలనీలాలు సమర్పించే కళ్యాణ కట్ట, నందకం మినీ కళ్యాణ కట్టల్లో శుక్రవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భక్తుల తలనీలాల సమర్పణను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్షురకుల ప్రవర్తనపై అభిప్రాయాలను భక్తుల నుండి తెలుసుకున్నారు. ఒక ప్రాంతంలోని కళ్యాణకట్టలో రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు రద్దీ తక్కువగా ఉండే కళ్యాణకట్టకు భక్తులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కళ్యాణకట్టను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా సేవాభావంతో విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతా రామ్, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు తిరుమలలో 'స్వచ్ఛాంధ్ర'

ప్రజాశక్తి -తిరుమల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారమైన ఏప్రిల్ 19న తిరుమలలో సామూహిక శ్రమదానాన్ని టీటీడీ నిర్వహించనుంది. తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని రోడ్లపై చెత్తను తొలగించి శుభ్రం చేయనున్నారు. అలిపిరి నడక దారిలోని కుంకాల పాయింట్ (ఆఖరి మెట్టు) వద్ద నుండి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటి

తిరుపతి పరిధిలోగల నార్త్ సెక్షన్ ,ఈస్ట్ సెక్షన్, వెస్ట్ సెక్షన్ , సౌత్ సెక్షనలలో గల 33/11కె.వి సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు కారంగా మాధవ నగర్ సెక్షన్లో 132 కె.వి అలిపిరి సబ్ స్టేషన్లలో 19న శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంత రాయం ఏర్పడుతుంది అని ఏపి. ఎస్పీడీ.సి.ఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ. విన్నకటి చంద్ర శేఖర్ రావ్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. భవీనీనగర్, మధురనగర్, కొర్లగుంట, అశోక్‌నగర్, తాతయ్యగుంట, తుడరోడ్డు, రెడ్డి రెడ్డి కాలనీ, టికె స్ట్రీట్, కెకెలేఔట్, రైల్వేకాలనీ, సుందరయ్యనగర్, భవానీనగర్, కాంతినగర్, జీవకోన, శివజ్యోతినగర్, ఉపాధ్యాయనగర్, శ్రీనగర్ కాలనీ, ఎస్ఎల్‌వి నగర్, అయ్యప్పకాలనీ, ఎర్రమిట్ట, సత్యనారాయణపురం, సాయినగర్, వెంకటరమణ లేఔట్, రాఘవేంద్ర నగర్, జర్నలిస్ట్ కాలని, భూపాల్ నగర్, కైలాష్ నగర్ తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులందరు విద్యుత్ సరఫరాలోనీ ఆంతరాయన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఇకనైనా టీటీడీపై రాజకీయాలు ఆపండి : సిపిఐ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

టీటీడీపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని, అటువంటి చోట రాజకీయాలు తగదని వివిధ రాజకీయ పార్టీలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హితవు పలికారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసి లబ్ధిపొందేలా పరస్పర ఆరోపణలకు ఇక ఫుల్ స్టాప్ పెట్టాల్సిందిగా ఆయన కోరారు. శుక్రవారం తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గోశాల విషయాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకోవద్దని, అందుకోసం తాను చేతులు జోడించి కోరుతున్నానని సూచించారు. హైడ్రామాలు సృష్టించి భక్తుల మనోభావాలతో దెబ్బతీసేలా ప్రవర్తించవద్దని, టీటీడీపై ఇంతటితో రాద్ధాంతం మానుకోవాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి పాల్గొన్నారు.



మెడికల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నిండుప్రాణాన్ని కాపాడిన ట్రైనీ ఐపిఎస్



ప్రజాశక్తి - రామచంద్రాపురం

మండలంలోని పివిపురం సమీపంలోని మామిడితోటలో జీవితంపై విరక్తితో ఓ మెడికల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న విషయాన్ని స్నేహితుల ద్వారా తెలుసుకున్న ట్రైనీ ఐపిఎస్ హేమంత్ నిండు ప్రాణాన్ని కాపాడారు. గురువారం రాత్రి 10 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతిలోని ఎస్‌వి మెడికల్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థి నంద్యాల వాస్తవ్యుడు. గురువారం సాయంత్రం తిరుపతి నుంచి పివిపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మామిడి తోటలో ఆత్మహత్య చేసుకుంటానని స్నేహితులకు ఫోన్‌లో సమాచారం చెప్పాడు. ఈ విషయాన్ని స్నేహితులు ఆర్‌సిపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ట్రైనీ ఐపిఎస్ బొడ్డు హేమంత్ లొకేషన్ ట్రేస్‌అవుట్ చేసి 20 నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని ఆ విద్యార్థి ప్రాణాలను కాపాడారు. అనంతరం ఆ విద్యార్థికి కౌన్సిలింగ్ ఇచ్చి సమీప బంధువు తిరుతపిలో ఉండడంతో పిలిపించి ఆ విద్యార్థిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మహేష్, త్యాగరాజులు పాల్గొన్నారు.

'ఈ-వేస్ట్' ను ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో అందించండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలో ప్రతి ఇంటి వద్ద, దుకాణాల వద్ద ఉత్పత్తి అయిన ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వస్తువులు) ను రాయల్ నగర్ నందు ఏర్పాటు చేసిన ఆర్.ఆర్.ఆర్ సెంటర్ నందు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా ప్రతి మూడవ శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ తెలిపారు. ఈ నెల ఈ-వేస్ట్ నిర్వహణ, సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ-వేస్ట్ సేకరణ నగరంలోని న్యూ బాలాజి కాలని అన్నా క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్ వద్ద వద్ద ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు సేకరిస్తామని తెలిపారు. ఎలక్ట్రికల్ వస్తువులు అయిన కంప్యూటర్లు, బ్యాటరీలు, సెల్లులు, ఎలక్ట్రికల్ ఫోన్ తదితర వస్తువులు అన్ని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ వద్ద ఇవ్వ వచ్చునని అన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు పాత మునిసిపల్ కార్యాలయం నుండి శ్రీదేవి కాంప్లెక్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ - వేస్ట్ అంటే ఏంటి, ఏ ఏ వస్తువులు ఉంటాయి, నిర్వహణపై శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద అవగాహన కల్పిస్తామని అన్నారు.

పూలే, అంబేద్కర్ జీవితాల్లో హేతుబద్ధత



ప్రజాశక్తి - తిరుపతి సిటి

పూలే, అంబేద్కర్ జీవితాల్లో హేతుబద్ధత కనిపిస్తుందని, శాంతి, మానవీయ విలువలు, సత్యాన్వేషణతో సమాజ మార్పు కోసం గొప్ప రచనలు చేయడంతో పాటు సంస్కరణ పోరాటాలు నడిపారని వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో 'తల్లిపాల నిధి' ఛైర్మన్ నడ్డినారాయణ అధ్యక్షతన 'పూలే అంబేద్కర్ ఆలోచనల విధానం.. ఆవశ్యకత'పై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు, టెంకాయల దామోదరం మాట్లాడుతూ ఆఫ్రికాలో బానిసత్వం కంటే భారత్‌లో కులవివక్ష అత్యంత హేయమైనదిగా ఉందన్నారు. మతోన్మాదాన్ని మూకుమ్మడిగా వ్యతిరేకించాలన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను హోంమంత్రి అవమానించిన స్థితిలో ప్రజలు, ప్రగతివాదులు కలిసి అంబేద్కర్, పూలే ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ముఖ్య అతిథి కడప వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఎం వినోదిని మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ సంఘసంస్కర్తలే కులవివక్షకు గురయ్యారని, గులంగారి, కులనిర్మూలన వంటి రచనలు చేశారని గుర్తు చేశారు. బుద్ధుడు, కబీర్, పూలే తమ గురువులని అంబేద్కర్ చెప్పారన్నారు. పూలే అంబేద్కర్‌లతో హేతుబద్ధత కనబుడుతుందని, శాంతి, మానవీయ విలువలు, సత్యాన్వేషణతో సమాజ మార్పు కోసం గొప్ప రచనలు చేయడంతో పాటు, సంస్కరణ పోరాటాలు నడిపారన్నారు. కుట్రపూరితమైన భావ బానిసత్వ స్థితిని గుర్తించారన్నారు. సోదరభావం, మానవీయత, హేతుబద్ధత భావాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఎం.నాగార్జున పాల్గొన్నారు.

ఎపి పీజీసెట్‌కు దరఖాస్తులు ఆహ్వానం : వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రవ్యాప్తంగా స్విమ్స్, జేఎన్టీయూ వర్సిటీలలోని వివిధ పీజీ సైన్స్ కోర్సులతోపాటు, దాదాపుగా 17 విశ్వ విద్యాలయాలలో 2025-26 అకడమిక్ సంవత్సరానికి చేరే ఆసక్తి ఉన్న అభ్యర్థుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ పీజీ సెట్ చైర్మన్, ఎస్వీయూ ఇంచార్జీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న డిగ్రీ పూర్తి చేసిన, డిగ్రీ ఫైనలియర్, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వివిధ కోర్సులలో చేరేందుకు అర్హులన్నారు. దరఖాస్తులను విద్యార్థులు, అభ్యర్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 2వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు ఓసీ విద్యార్థులు రూ.850, బిసి విద్యార్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.650 రూపాయల ఆన్లైన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీ పీజీ సెట్ కన్వీనర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ ఆచార్య సురేంద్రబాబు కొంగర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పీజీ సెట్ ప్రవేశ పరీక్షలో విద్యార్థులు ఆరో సెమిస్టర్ పూర్తి అవగానే వివిధ పీజీ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. దీనికి సంబంధించిన కోర్సులకు సంబంధించి ఎలిజిబిలిటీ క్రైటీరియా వివరాలను సమాచారం పూర్తిగా వెబ్సైట్లో అందుబాటులో ఉందని వెల్లడించారు. ఈ ఎంట్రన్స్ పరీక్ష 153 కోర్సుల్లో చేరడానికి 31 సబ్జెక్ట్ పరీక్షలను జూన్ 6 నుంచి 13 వరకు మూడు సెషన్స్ లలో నిర్వహిస్తారని, 13 పాత జిల్లా కేంద్రాలను ఆధారంగా దాదాపు 35 పరీక్ష కేంద్రాలలో పరీక్ష జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్, కామర్స్, ఎడ్యుకేషన్, సైన్సెస్ లలో 30,534 సీట్లకు పిజిసెట్-2025 నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సారి అడ్మిషన్లలో పిజి కోర్సుల్లో విద్యార్థులు బాగా చేరతారని ఆకాంక్షించారు.

టిటిడి సేవలు సంతృప్తికరం

ఏపి అసెంబ్లీ అంచనాల కమిటీ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం కార్యకలాపాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. తిరుపతిలోని పద్మావతి గెస్ట్ హౌస్‌లో ఈ సమీక్ష సమావేశం జరిగింది. అంచనాల కమిటీ భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవల వివరాలు తెలుసుకుంది. టీటీడీ అందిస్తున్న సేవలపై కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని అంచనాల కమిటీ సభ్యులు సూచించారు. శ్రీవారి వైభవాన్ని తెలియజేసేలా డిజిటల్ మీడియాను బలోపేతం చేయాలని తెలిపారు. స్వామివారి కీర్తనలు, గోవింద నామాలు రాత్రి 10 గంటల వరకు వినిపించాలని పేర్కొన్నారు.ఈ సమావేలంలో అంచనాల కమిటీ సభ్యులు పయ్యావుల కేశవ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.



వక్ఫ్ సవరణను వెనక్కి తీసుకోవాలని ర్యాలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వక్ఫ్ చట్టంలో చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు శుక్రవారం పట్టణ నాలుగు మాడ వీధుల్లో నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సవరణ బిల్లును వెనక్కి తీసుకునే వరకు కేంద్రంతో పోరాడుదామని పిలుపునిచ్చారు. వామపక్ష జేఏసీ నాయకులు మద్దతు తెలిపారు. వక్ఫ్ బోర్డు మాజీ సిరాజ్ బాషా, సిపిఎం నేతలు బాలసుబ్రమణ్యం, గంధం మణి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

24న మతాలకు అతీతంగా శాంతియుత ర్యాలీ

నాయుడుపేట : వక్ఫ్ బోర్డ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 24న శాంతియుతంగా జరిగే ర్యాలీకి మతాలకతీతంగా మద్దతు తెలపాలని ముస్లిం సోదరులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం జామియా మసీదు వద్ద మౌలానా అబూ అక్బర్ నాయుడుపేట ముస్లిం సోదరులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముస్లిం సోదరులు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా కొనసాగుతున్న భారత దేశంలో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డ్ బిల్లు ముస్లిం సోదరుల మనుగడకు పెను ప్రమాదం వాటిల్లనున్నట్లు ఆయన తెలియజేశారు.ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నట్లు మేధావులు సైతం చెబుతున్నారని, ఈ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా ముస్లింలందరూ కోరుకుంటున్నారని ఆయన చెప్పుకొచ్చారు ఈ క్రమంలోనే ఈనెల 24వ తేదీన నాయుడుపేటలోని జామియా మసీదు సమీపంలో షాదీ మందిర్ నుంచి ఉదయం 8:30 లకు ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం వద్దకు ముస్లిం సోదరులంతా శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హాజీ నిజాముద్దీన్, శుభహాని, మస్తాన్, ఇబ్రహీం, మౌజల్ పాల్గొన్నారు.

'మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మాజీ సీఎం జగన్ కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం మానుకోవాలని టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు యం. సుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. వైసీపీని ప్రజలు ఛీ కొట్టడంతో జగన్ తన ఉనికిని చాటుకోవడానికి కుల రాజకీయాలకు తెరదీశారని విమర్శించారు. రోడ్డు ప్రమాదంలో మతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని హత్యగా చిత్రీకరించి క్రిస్టియన్లను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.. తిరుమలలో గోవులు చనిపోయాయంటూ మరో కుట్రకు తెరలేపారని మండిపడ్డారు. వక్ఫ్ బిల్లుపై పార్లమెంట్‌లో ద్వంద్వ వైఖరి అవలంభించి తిరిగి ముస్లింలను రెచ్చగొడుతున్నాడనీ, ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో వైసీపీ నాయకులు కుట్రలు చేయడం చూస్తే ఊరుకునేది లేదని సుబ్బయ్య హెచ్చరించారు.

నెట్ సెంటర్లో పోర్న్ వీడియోస్ పోలీసులకు మహిళ ఫిర్యాదు


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలోని పాత బలరాం థియేటర్ సమీపంలో ఉన్న ఓ నెట్ సెంటర్లో యువత ఫోర్న్ వీడియోలు చూస్తున్నారంటూ ఓ మహిళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు నెట్ సెంటర్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. వివరాల్లోకి పోతే ...చెన్నైకి చెందిన ఓ మహిళ విద్యార్హత సర్టిఫికెట్ల కోసం శ్రీకాళహస్తికి వచ్చింది. ఓ సర్టిఫికెట్‌ను జిరాక్స్ తీసుకునేందుకు పాత బలరాం థియేటర్ సమీపంలో ఉన్న నెట్ సెంటర్ కు వెళ్ళింది. యువత అక్కడ ఉమ్మడిగా కూర్చుని పోర్న్ వీడియోలు చూడటాన్ని గమనించింది. ఇది తప్పని, యువతని పెడదోవ పట్టించొద్దంటూ నిర్వాహకుడితో వాగ్వాదాన్ని దిగింది. నిర్వాహకుడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో 100కు డయల్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో సమాచారం అందుకున్న వన్ టౌన్ పోలీసులు సెంటర్ నిర్వాహకుని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. మొదటి తప్పు కింద బైండోవర్ కేసు నమోదు చేసి నిర్వాహకుడిని వదిలిపెట్టారు.

పాపవినాశనంలో బోట్ రైడింగ్‌పై...

అటవీ శాఖ ప్రకటన ఏంటో...?

టిటిడి పటిష్ట భద్రతా వ్యవస్థ ఏమైంది..?



మార్చి 25న పాపవినాశనం డ్యామ్ లో పర్సనల్ బోట్ రైడింగ్ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తులు వచ్చే తిరుమలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దశాబ్దాలుగా భద్రత విషయంలో స్వల్ప మార్పులు చేస్తూ మరింత మెరుగైన భద్రతను తిరుమలకు కల్పించారు. తిరుమలలో ఏ చిన్న సంఘటన జరిగినా ప్రపంచవ్యాప్తంగా అది పెద్ద దుమారాన్నీ రేపుతుంది. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఎక్కడ గాని అసౌకర్యం కల్పించ కూడదన్న ఉద్దేశంతో అన్ని ఏర్పాట్లను తిరుమల తిరుపతి దేవస్థానం స్వీయ పర్యవేక్షణ చేస్తుంది. ఈ నేపథ్యంలో తిరుమల చుట్టూ ఉండే అటవీ భూభాగాన్ని అటవీశాఖ, టీటీడీకి చెందిన అటవీ విభాగం రెండు సంయుక్తంగా పర్యవేక్షణ చేయాల్సి ఉంది. కానీ ఇటీవల చూస్తే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలతోనే ప్రక్షాళన మొదలు పెడతానని ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలకు విరుద్ధంగా కొంతమంది అధికారులు నడుచుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. తిరుమలకు వచ్చే యాత్రికులకు తాగునీటి, వినియోగ అవసరాల కోసం ఎంతో ముందు చూపుతో పాపవినాశనం డ్యాంను నిర్మించారు. ఈ నీటిని ఇప్పటికీ టీటీడీ అవసరాలకు వినియోగిస్తోంది.

ముందుస్తు సమాచారం ఇవ్వకనే....

తిరుమల పాపవినాశనం డ్యామ్ లో పర్సనల్ బోట్ రైడింగ్ కు సంబంధించి ఎటువంటి ముందస్తు సమాచారం టిటిడికి ఇవ్వలేదని విమర్శలు ఉన్నాయి. తిరుపతి నుండి తిరుమలకు చేరుకోవాలంటే అనేక తనిఖీలు చేసిన తర్వాతే టిటిడి కొండపైకి భక్తుల వాహనాలను, సామాగ్రిని అనుమతిస్తుంది. ఇక ప్రభుత్వ వాహనాలకు తనిఖీలు అనేవి చెప్పుకోదగినవిగా ఉండవు. కానీ తిరుమలకు అటవీశాఖ పర్సనల్ బోట్లను తరలించింది. మార్చి 25న ఈ పర్సనల్ బోట్ రైడింగ్ చేయడంపై తీవ్ర దుమారం రేగింది. టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సైతం తిరుమల భద్రత గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ మీడియా ముందు తన గళాన్ని వినిపించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పవిత్రమైన పాప వినాశనం డ్యామ్ లో ఇటువంటి పర్సనల్ బోట్ రైడింగ్ కు ఎలా అనుమతి ఇచ్చారని టిటిడి అధికారులపై దుమ్మెత్తి పోశారు. మరోవైపు ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తూ తిరుమలలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉన్నా అక్కడ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని కార్యకలాపాలు జరుగుతున్నాయని, దీనిపై కేంద్ర ప్రభుత్వం దష్టి సారించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అటవీశాఖ చేసిన ఈ దుందుడుకు చర్యతో టిటిడి అధికారులు ఉలిక్కిపడ్డారు. అసలు ఈ బోట్లు తిరుమలకు ఎలా వచ్చాయి అని ఆరా తీశారు. సాయంత్రానికి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ పాపవినాశనం డ్యామ్ చుట్టుపక్కల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈ కార్యకలాపాలను గమనించడానికి ఈ పర్సనల్ బోట్లను వినియోగించినట్లుగా పత్రిక ప్రకటన విడుదల చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై అటవీ శాఖ ప్రకటన ఏంటి?

తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల భద్రత విషయంలో రాజీలేని విధంగా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. టిటిడికి ముఖ్య నిఘా, భద్రత అధికారిగా ఓ ఐపీఎస్ అధికారి ఉంటారు. తిరుమలలో అన్ని సెక్టార్లకు సంబంధించి భద్రత విషయంలో ఆయనే పూర్తి సర్వాధికారిగా వ్యవహరిస్తారు. మరి తిరుమల పాపవినాశనం డ్యామ్ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే టీటీడీ స్పందించాలి గాని, అటవీ శాఖ అడుగు ముందుకేసి భద్రతా చర్యలపై పర్సనల్ బోట్ రైడింగ్ ఎందుకు చేసిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. అసలు ఆ బోట్ రైడింగ్ లో పాల్గొన్న వారు ఎవరు? భద్రతా సిబ్బందా, అటవీ శాఖ సిబ్బందా..? లేక మరి ఇతరులా? అనే అంశాలు మాత్రం బయటకి పొక్కనివ్వలేదు. అటవీశాఖ చేసిన ఈ దుందుడుకు చర్యతో టిటిడి అప్రమత్తమై ముఖ్యమంత్రి కార్యాలయానికి అటవీశాఖ అధికారి వివేక్ పై ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం.

సాధారణంగా పర్సనల్ బోట్లు.....

సాధారణంగా తిరుమలలో వినియోగించిన ఈ పర్సనల్ బోట్లు సముద్ర తీరాలలో, నదులలో పర్యాటకులు వినియోగించేటివి. మరి భద్రతా పర్యవేక్షణకు ఇటువంటి బోట్లు వాడే ప్రసక్తే లేదని తెలుస్తోంది. మరి భద్రతకు ఈ బోట్లను వినియోగించాలని అటవీశాఖ ఎందుకు భావించింది. సాధారణంగా ఈ బోట్లను రైడ్ చేయాలంటే నైపుణ్యం చాలా అవసరం. వందల అడుగులలోతైన పాపవినాశనం డ్యామ్ లో నైపుణ్యత లేని వారు ఈ బోట్లను రైడ్ చేయలేరు. అటవీశాఖ అధికారి వివేక్ టిటిడి కి సంబంధించిన భద్రత వ్యవహారాల్లో తలదూర్చడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా అమరావతి హాస్పిటల్ వార్షికోత్సవం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు చర్చి వీధిలో ఉన్న అమరావతి హాస్పిటల్ 17 వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ రమణయ్య, డాక్టర్ నిర్మల దంపతులను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణయ్య, డాక్టర్ నిర్మలలు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా తమ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తమ హాస్పిటల్లో కిడ్నీ వ్యాధి గ్రస్తులకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు, ఆర్థోపెడిక్ రోగులకు విశేష అనుభవం ఉన్న డాక్టర్లచే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించామన్నారు. హాస్పిటల్ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

స్వర్ణాంధ్ర భారతిలో గ్రాడ్యుయేషన్ డే



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణం, మారుతి నగర్, శ్రీ స్వర్ణాంధ్ర భారతి పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, తల్లిదండ్రులకు పాదాభివందనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని, చదువులపై ఆసక్తిని పెంపొందించేలా శ్రీ స్వర్ణాంధ్ర భారతి పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేసి, వేద పండితుల ఆధ్వర్యంలో విద్యార్థులు తమ తల్లులకు పాద పూజ చేయించారు. ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం నవకోటి నాయుడు, పాఠశాల డీన్, సి.డి.సునీల్ రాజ్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కె.హరికృష్ణ,ప్రైమరీ ఇన్-చార్జ్ సింధు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

21న 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - తడ: తడ మండలం, అక్కంపేట ఆదర్శ పాఠశాలలో సోమవారం 6 వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సౌజన్య తెలియజేశారు. పరీక్ష వ్రాసే విద్యార్థులు ఆన్లైన్ ద్వారా హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోని అందులో తెలియ జేసిన సమయానికి పరీక్షకు హాజరు కావాలన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లో ఫోటో లేకున్నను ఆందోళన చెందవలసిన అవసరం లేదని పరీక్షకు వచ్చేటప్పుడు 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను తీసుకువస్తే సరిపోతుందని తెలియజేశారు.

'రోజా.. నోటి దురుసు మాటలు మానుకో'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ మంత్రి రోజా నోటి దురుసు మాటలు తగ్గించుకుని మాట్లాడాలని జనసేన పార్టీ కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి సూచించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వీర మహిళలతో కలిసి సుభాషిణి మాట్లాడారు. తిరుపతి నగరంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూమన క్రియేషన్స్లో రోజు ఏదో ఒక డ్రామాలు తెరపైకి తెస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇవన్నీ అట్టర్ ఫ్లాప్ డ్రామాలని, ఇకనైనా డ్రామాలు ఆపాలన్నారు. మాజీ మంత్రి రోజా పోలీసులపై అసభ్యకర పదజాలాన్ని వాడుతు న్నారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి గుండు చేయించుకోవడంపై కూడా విమర్శలు చేయడం హేయమైన చర్య అన్నారు. వైసిపి ఓడిపోవడానికి రోజా వ్యవహార శైలి, మాట తీరే కారణమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వీర మహిళలు చందన, అమృత, రాధా, శిరీష, శాంతి పాల్గొన్నారు.

డేవిడ్ను పరామర్శించిన రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమల పేట వైఎస్ఆర్సిపి నాయకులు, నియోజకవర్గ డాక్టర్స్ విభాగం ప్రెసిడెంట్ డేవిడ్ ఇటీవల చేయి ఎముక విరగడంతో వైద్య చేయించుకుని, విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రోజా తన సోదరుడు రాంప్రసాద్ రెడ్డితో కలిసి వెళ్లి శుక్రవారం ఆయనను పరామర్శించారు. వారి వెంట వైసీపీ నాయకులు నందయ్య, ప్రజా ప్రతినిధులు, పార్టీ కన్వీనర్, స్టేట్ నాయకులు, స్థానిక పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తంగవేలు మృతికి ఆదిమూలం నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం, నీరువాయికి చెందిన అర్ఎంపి డాక్టర్ తంగవేలు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం నీరువాయికి చేరుకుని తంగవేలు భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీ.ఇలంగోవన్ టీడీపీ సీనియర్ నేతలు పద్దు రాజు, నాగరాజు, కరివరధన్, ఆర్ముగం, డిల్లీ, రుకేష్లు పాల్గొన్నారు.

శ్రీశైల భ్రమరాంబికకు సారె సమర్పణ



ప్రజాశక్తి -ఏర్పేడు : శ్రీశైల భ్రమరాంబిక వార్షిక కుంభోత్సవానికి ఏర్పేడు మండలం జంగాలపల్లి వాసులు డాక్టర్. నైనారు పోన్నారావు, మీనాక్షి దేవి, ఏర్పేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నైనారు బాలాజీ రావు, డాక్టర్ నైనారు పృథ్వి వారి కుటుంబ సభ్యులు శ్రీ మల్లికార్జున భ్రమరాంబ సమేత స్వామివారికి పట్టు వస్త్రాలు, గాజులు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, మొదలగు వాటిని ఈవో శ్రీనివాసరావు సహకారంతో అమ్మవారు అయ్యవార్లకు సమర్పించారు. వీరు ప్రతిఏటా శక్తిపీఠాలలో అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన నల్ల గాజులు అలంకరించడం సారె నివ్వడం ఆనవాయితీగా వస్తోంది. డాక్టర్ నైనారు పోన్నారావు కుటుంబం సభ్యులు స్వతహాగా నల్ల గాజులు తయారు చేయు కుల వృత్తి కలిగిన వారు. ప్రతి ఏటా వార్షికోత్సవం ముందు అమ్మవారికి, అమ్మవారి ఇంటి తరపున ఈ సారె నివ్వడం పార్వతి దేవి అనుగ్రహంతో పుట్టిన గాజుల బలిజమైనా తమకు ఈ అవకాశం దక్కడం ఎంతో అదృష్టంగా భావిస్తూ ఈ ఆనవాయితీని మాకు పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని, మా దంపతులకు ఆదిదంపతులు ఇచ్చిన దీవెనలుగా పూర్వజన్మ సుకృతంగా భావించి అమ్మవారికి ప్రతి ఏటా ఈసారి ఇవ్వడం ఎంతో ఆనందమని డా. నైనారు పోన్నారావు తెలిపారు.

నేడు 'స్వర్ణాంధ్ర .. స్వచ్ఛాంధ్ర'

ప్రజాశక్తి - రామచంద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలో అన్ని గ్రామాలలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇందిరమ్మ, డిప్యూటీ తహసిల్దార్ అన్వర్ భాషాలు తెలిపారు. ఈ వేస్ట్ సేకరణపై గ్రామాలలో టాం టాం వేయాలని, ప్రచార సాధనాలు, గ్రామాలలో దేవాలయాల వద్ద ఉన్న సౌండ్ సర్వీసుల ద్వారా ముందస్తుగా ప్రజలకు తెలియపరచాలని గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు తమ గృహాలలో నిరుపయోగంగా ఉన్న (ఈ వేస్ట్) ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులను గ్రామాల్లో ఏర్పాటు చేసే ఈ వేస్ట్ స్టాల్స్కు అందజేయాలన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులందరూ కూడా తమ కార్యాలయాలలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించి కార్యాలయాన్ని శుభ్రపరచాలన్నారు. ఏప్రిల్ మాసంలో గ్రామసభలు ఏర్పాటు చేసి ఈ వేస్ట్పై ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులను వారు ఆదేశించారు. ఈ వేస్ట్ పరికరాలను మండల స్థాయిలో



సేకరించి రీసైక్లింగ్ ఆథరైజింగ్ సెంటర్లకు అందజేయడానికి కృషి చేద్దాం అన్నారు.

పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు పంచాయతీలకు అప్పగించండి

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని 12 పంచాయతీ ప్రజలు తమ ఇంటిలో పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు పంచాయతీలకు అప్పగించాలని డిప్యూటీ ఎంపీడీవో మాలతి కోరారు. శనివారం జరగబోయే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ గ్రామంలో నిర్వహించే తడి చెత్త పొడి చెత్త సేకరణతో పాటు పాడైపోయిన మొబైల్ ఫోన్లు, ప్రింటర్లు, మానిటర్లు, బ్యాటరీలు, టీవీలు, రిమోట్లు, రిఫ్రిజిరేటర్లు మొదలైన ఎలక్ట్రానిక్ వస్తువులను గ్రామపంచాయతీలకు అందజేయాలని కోరారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు వలన వ్యాధులు బారిన పడతారని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో మాలతి పేర్కొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ రోజు ఉదయం స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర వచ్చే దివాస్ కార్యక్రమం జరుగుతుందని బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ కార్యదర్శి తండా సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, గ్రామ సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ప్రజా సంఘాల గ్రూపు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, అన్ని శాఖల సిబ్బంది హాజరుకావాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎస్ఎఎల్సి చర్చి, పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ సంఘం, సార్వత్రిక ప్రార్థనా మందిరాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు గీతాలు ఆలపించి దైవ సందేశం అందించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మానవాళిని పాపాల నుంచి రక్షించడం కోసం ప్రభువైన ఏసుక్రీస్తు తన ప్రాణాలను అర్పించిన రోజు గుడ్ ఫ్రైడే అని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ పాస్టర్ సెల్వం పేర్కొన్నారు. పుత్తూరు, ఎన్జీవో కాలనీ చర్చ్ ఆఫ్ క్రైస్ట్, చర్చి కాంపౌండ్ లూథరన్, సిఎస్ఐ, ఈసీఐ, పెంతకోస్తు, చుట్టు పక్కల ప్రాంతాల చర్చల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, రాజా, చిరంజీవి, జోష్, మహిళలు పెద్దలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని కనకభూషణ్ లేఔట్, షెకీనా చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రార్థనలు సీనియర్ పాస్టర్ అరుల్ అరసు, పాస్టర్ జోయల్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ ప్రార్థనల్లో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నార న్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టోఫర్ సామ్యూల్, జెర్మియా, మోషే, సుసన్, హిప్సిబా, జెస్సీ, దెబోరా పాల్గొన్నారు.



గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ అరుల్ అరసు

పాడి సంరక్షణపై శ్రద్ధ చూపండి



ప్రజాశక్తి - రామచంద్రాపురం: పాడి రైతులు వేసవిలో పశువుల సంరక్షణ కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.రవి కుమార్ కోరారు. మండలంలోని నెన్నూరులో జాతీయ సాంఘిక సేవా పథకం కింద తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ రవి కుమార్ మాట్లాడుతూ వేసవిలో పశువులకు వడదెబ్బ తగలకుండా నీడ ఏర్పాటు చేయాలని, రోజుకు నాలుగైదు సార్లు నీరు త్రాగించాలన్నారు. పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం సలహాలు తెలియజేశారు. ఈ పశు వైద్య శిబిరంలో 200 పశువులకు సాధారణ చికిత్సలు, పిడిదులు, గోమారుల నివారణకు మందుల పిచికారి చేశారు. 75 పశువులకి గర్భకోస వ్యాధులకు చికిత్సలు, 50 దూడలకు నట్టల నివారణ, 10 పశువులలో శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ జయకిషోర్ తెలిపారు. ఈ శిబిరంలో శ్రీ వెంకటేశ్వర పశు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జానకిరామయ్య, ప్రొఫెసర్ వైకుంఠ రావు పశు వైద్య కళాశాల విద్యార్థులు విద్యార్థినిలు, సహాయకులు యుగంధర్, సోమశేఖర్, రాజశేఖర్, బాల చంద్ర, దామో దరం నెన్నూరు గ్రామ సర్పంచి అనసూయ, ఎంపీటీసీ సభ్యురాలు జ్ఞానమ్మ, పాడి రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వంటింట్లో గాలి, వెలుతురు ఉండాలి. అగ్ని ఉన్నచోట గ్యాస్ సిలిండర్ ఉంచరాదని, ఉన్నట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, పుత్తూరు అగ్నిమాపక కేంద్ర అధికారి నేతాజీ తెలిపారు. పుత్తూరు పట్టణంలో పుత్తూరు నారాయణవనం హెచ్.పీ గ్యాస్ కంపెనీల పెట్రోల్ బంక్ వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఓవి నాగేశ్వరరావు, సిబ్బంది లీడింగ్ ఫైర్ మాన్ విశ్వనాథ శెట్టి, డ్రైవర్ ఆపరేటర్లు సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఓజిలి : ప్రజలు అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని నాయుడుపేట అగ్నిమాపక శాఖ ఇంచార్జ్ అధికారి డివి రమణయ్య పేర్కొన్నారు.



అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని ఓజిలి మండల పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఉన్న సీఎన్జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డివి రమణయ్య మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత పెరగడంతో ఉష్ణోగ్రతలు పెరిగి అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ప్రమాదాల నివారణకు సూచనలు ప్రయోగాత్మకంగా చూపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్ మాన్ అమరావతి చంద్రబాబు,ఫైర్ మెన్ లు ఏ.సందీప్, ఎం.నాగరాజు, కే పోలయ్య, హెచ్ బాలాజీ, సుబ్రహ్మణ్యం, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దశాబ్దాలుగా మాల, మాలల ఉప కులాలు, మాదిగ, మాదిగ ఉపకులాలు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నాయని ఎస్సీ వర్గీకరణ బిల్లుతో న్యాయం జరుగుతుందని, వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని ఉమ్మడి చిత్తూరు జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు సుబ్బయ్య అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్లు కార్యరూపం దాల్చడానికి కృషి చేయాలని, ఎంతోమంది దీనికోసం పోరాడారని, వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గంగులయ్య, నీలిమ, నల్లాని బాలాజీ, మోహన్, మునికృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గడ్డివాము దగ్ధం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఇందిరా నగర్లో శుక్రవారం గడ్డి వాము దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. గూడూరు అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ కథనం మేరకు, గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన శీనయ్య అనే వ్యక్తికి చెందిన గడ్డి వాము దగ్ధమైందన్నారు. ఆకతాయిలు అగ్గిపుల్ల వేయడంతో ఈ సంఘటన జరిగిందని బాధితుడు తెలిపారన్నారు. సుమారు 850 గడ్డిమోపులు కాలిపోయాయన్నారు. సమాచారం అందిన వెంటనే తమ సిబ్బంది ద్వారా మంటలను అర్పివేయడం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు 40 వేల రూపాయలు విలువ చేసే గడ్డి అగ్నికి ఆహుతయ్యిందని తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని తిప్పవరప్పాడులో ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు గూడూరు మండల పరిధిలోని తిప్పవరప్పాడుకి చెందిన వెడిచెర్ల లక్ష్మమ్మ చిల్లర దుకాణం నడుపుతోంది. దుకాణానికి కూల్ డ్రింక్ కావాలని వచ్చిన దుండగుడు, ఆమె కూల్ డ్రింక్ ఇస్తుండగా మెడలోని 6 సవర్ల బంగారు గొలుసును లాక్కెళ్లడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) మహిళలు ఆర్థికంగా స్థిరపడాలన్నదే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తున్నదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి అన్నారు. చంద్రగిరి మండలం పరిధిలోని పిచ్చినాయుడుపల్లి, శానంబట్ల తిరుపతి రూరల్ మండలంలోని తనపల్లి పంచాయతీలో పులివర్తి సుధా రెడ్డి మహిళలతో శుక్రవారం ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. పంచాయతీలలో ఉన్న ఇతర సమస్యలను తెలుసుకుంటూ మహిళల పొదుపు సంఘాలతో వారు ఏ విధంగా ఆర్థికంగా ఎదగవచ్చునో తెలియజేస్తూ మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముఖాముఖి కార్యక్రమానికి వచ్చిన పులివర్తి సుధా రెడ్డిని కూటమి ప్రభుత్వం నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మహిళలను పులివర్తి సుధా రెడ్డి పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం ముందు చూపుతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో పలు రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సుధా రెడ్డి తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలకు స్వయం ఉపాధి కింద ఉచిత టైలరింగ్, స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు, మరెన్నో గొప్ప అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీలలోని సమస్యలు డ్రైనేజ్, వాటర్ ట్యాంక్, ఇంటి పట్టాలు, ఇతర సమస్యలను సుధా రెడ్డి దృష్టికి మహిళలు తీసుకొచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలాగా చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో లబ్దిదారులకు అందించారు. తొమ్మిదవ డివిజన్కు చెందిన సంజయ్ గాంధీ కాలనీకి చెందిన జె.మునీంద్రాకు ఆస్పత్రి ఖర్చుల కింద 48,333 రూపాయలను అందించారు. అలాగే జీవకోనలోని రాజీవ్ నగర్కు చెందిన ఎం.ఆదెమ్మకు రెండు లక్షల 21వేల 260 రూపాయల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, జీవకోన సుధాకర్, శిరీషా, బాబ్జీ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఆగి ఉన్న కారు అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి -తిరుమల : తిరుమల కౌస్తుభం పార్కింగ్ వద్ద ఆగి ఉన్న కారులో మంటలు చెలరేగాయి. అకస్మాత్తుగా జరిగిన ఈ ఘటనతో భక్తులు భయంతో పరుగులు తీశారు. ఒంగోలు నుంచి వచ్చిన భక్తులు ప్రయాణిస్తున్న రెనాల్ట్ డస్టర్ కారులోంచి పొగలొచ్చాయి. అప్రమత్తమై వెంటనే కారులో నుంచి దిగిపోయారు. ఆ తర్వాత కొన్ని సెకెన్లలోనే మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ఉన్నవారు వెంటనే కిందకు దిగడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. మంటల్లో కారు పూర్తిగా కాలిపోయింది..కారులో ఏసీ ఆన్ చేయగానే షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చేలరేగినట్టు అధికారులు గుర్తించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల: ఫైనాన్స్ కమిషన్ ఛైర్పర్సన్ అరవింద్ పనగారియా, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, మాజీ ఇండియన్ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ కుటుంబం శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి టిటిడి అధికారులు దర్శన ఏర్పాట్లను చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో ఆర్థిక మంత్రి: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దర్శించుకున్నారు. వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో ఆయన పాల్గొన్నారు. టీటీడీ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్ళిన మంత్రి పయ్యావుల స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శన అనంతరం అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

వడ్డెరలను యస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) సమాజంలో విధాల వెనుకబడి ఉన్న వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర జాతీయ సంఘం సభ్యులు డాక్టర్ గుంజి నరసింహారావు కోరారు. చంద్రగిరి మండలం, నారావారిపల్లిలో శుక్రవారం వడ్డెరల జన చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడైన వడ్డెర ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలన్న తమ కోరికను మన్నించి జీవో విడుదల చేసి, ఘనంగా నిర్వహించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర జాతి స్థితిగతులను అధ్యయనం చేయటానికి ఏర్పాటుచేసిన సత్యపాల్ కమిటీ నివేదికను బహిర్గతం చేసి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అమర్నాథ్ మాట్లాడుతూ వడ్డెరలు అధిక శాతం మంది తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేశారని గతంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. వడ్డెరలు 12 రాష్ట్రాలలో ఎస్సీలుగాను, రెండు రాష్ట్రాలలో ఎస్టీలు గాను ఉన్నారని అదేవిధంగా మన రాష్ట్రంలో కూడా ఎస్టీ జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని జిల్లాలలో వడ్డెరలను చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత ఉధృతంగా సాగించడానికి చేపడుతున్న జనచైతన్య యాత్రని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వడ్డెర జన చైతన్య యాత్రను జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర జిల్లా సంఘం నాయకులు సభ్యులు పాల్గొన్నారు.



వడ్డెర జన చైతన్య యాత్రలో ప్రసంగిస్తున్న డాక్టర్ గంజి నరసింహులు



జన్మదిన వేడుకల్లో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఘనంగా ఆరణి శివ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆరణి శివ కుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. శివ పుట్టిన రోజు సందర్భంగా రుయా ఆస్పత్రి వద్ద జనసేన పార్టీ నాయకులు పేదలకు అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహాచారి, రాజా రెడ్డి, హెచ్డిఎస్ సభ్యులు లక్ష్మీపతి రాయల్, అన్నారెడ్డి, యువరాజ్ రెడ్డి, హేమకుమార్, కొండా రాజమోహన్, సుమన్, ఆముదాల వెంకటేష్, బాలిశెట్టి కిషోర్, జీవకోన సుధా తదితరులు పాల్గొన్నారు.